క్లుప్తంగా

సీతారామ కల్యాణానికి పందిరి రాట



రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా సీతారామ కల్యాణానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పందిరి రాట వేశారు. శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ వార్షికోత్సవం రోజున ఆనవాయితీగా ఏటా సీతారామ కల్యాణ పందిరి రాట వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వి.సింహాద్రి, ఎం.మధుసూదనరావు, విశాలాక్షినగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, సి.ఎ.ఎస్.రాజు, వి.డి.జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్‌షిప్ సాధించిన విద్యార్థులకు అభినందన



లెక్చరర్‌షిప్ సాధించిన విద్యార్థులతో వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం నుంచి ఎంబీఏ చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన యూజీసీ నెట్ ప్రవేశ పరీక్షలో లెక్చరర్‌షిప్‌కు అర్హత సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం వీరిని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో అభినందించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

కవిత్వాన్ని ఆస్వాదించాలి



ప్రసంగిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంకోర్ ఇంగ్లిష్ క్లబ్, ఆంగ్ల విభాగం వారు ఏర్పాటు చేసిన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ కవిత్వం ఒక తీరని దాహమని అభివర్ణించారు. విద్యార్థులు కవిత్వాన్ని ఆస్వాదించడం నేర్చుకోవాలన్నారు. ఎంకోర్ ఇంగ్లిష్ క్లబ్ కో ఆర్డినేటర్ పి.పద్మప్రియ క్లబ్ తరఫున నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాల గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ, ఆంగ్లం, తెలుగు, సంస్కృతం, హిందీ విభాగాధిపతులు ఆర్.రాణి, ఆర్.కుసుమ కుమారి, పోల ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మి, విద్యార్థులు ఆంగ్ల కవితలు, సంస్కృత శ్లోకాల వినిపించారు. కార్యక్రమంలో సి.వి.ఎస్.రవీంద్ర, ఎస్.వి.రామారావు, కె.రవిబాబు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



జడ్జి గోవర్ధన్‌కు మొక్క బహూకరిస్తున్న వసతి గృహం వార్డెన్ ఝాన్సీ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సెక్టార్–10లోని గిరిజన బాలికల వసతి గృహంలో శుక్రవారం పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయ శాఖ, ఎంవీపీ పోలీస్ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టాయి. విశాఖపట్నం 12వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ జడ్జి పి.గోవర్ధన్, ఎంవీపీ కాలనీ లా అండ్ ఆర్డర్ సీఐ మురళీ పాల్గొని పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలపై ఎలాంటి భౌతిక, లైంగిక దాడులు జరిగినా పోక్సో చట్టం కఠినంగా పరిగణిస్తుందన్నారు. 18 ఏళ్ల వయసు నిండని బాలికలంతా ఈ చట్టంపై అవగాహన పెంచుకోవాలని, సీనియర్ విద్యార్థులు, జూనియర్లకు సూచనలివ్వాలని చెప్పారు. ఎలాంటి వేధింపులు, ఇతర సమస్య ఉన్నా న్యాయ, పోలీస్ శాఖల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

కళావిహీనం..!


- శిథిలావస్థకు పిఠాపురం కాలనీ పార్క్
- పాడైన ఆట పరికరాలు, బెంచీలు
- పచ్చదనం, ఆహ్లాదం కనుమరుగు
- నిర్వహణను గాలికొదిలేసిన జీవీఎంసీ

బీచ్ రోడ్డు: పిల్లలు, పెద్దలకు ఆనందాన్ని, ఆరోగ్యాన్ని అందించే ఆ పార్క్ కళావిహీనంగా తయారైంది. పచ్చదనం, ఆహ్లాదం కనుమరుగై అధ్వానంగా దర్శనమిస్తోంది. సరైన నిర్వహణ, పర్యవేక్షణ లేకపోవడంతో శిథిల స్థితికి చేరింది. జీవీఎంసీ 22వ వార్డులోని పిఠాపురం కాలనీ పార్క్ దుస్థితి ఇది. దీనిలో పెద్ద పెద్ద చెట్లు మినహా ఊసే పచ్చదనం లేదు.



విరిగిన బెంచీలు

ఈ పార్క్‌లో సేదతీరేందుకు ఏర్పాటు చేసిన కుర్చీలు, బెంచీలు విరిగి శిథిలమైపోతున్నాయి. పార్కుకు వచ్చిన స్థానికులు, సందర్శకులు కూర్చునేందుకు ఇబ్బంది పడుతున్నారు. సిమెంట్ బెంచీలను బాగు చేయాలని కోరుతున్నారు.



ఆట వస్తువులిలా.. ఆడుకునేదెలా?

ఈ పార్కులో సగానికి పైగా ఆట వస్తువులు పాడై నెలలు గడుస్తున్నా.. నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. దీంతో పార్కులో సరదాగా ఆడుకుందామని వస్తున్న చిన్నారులకు నిరాశే ఎదురవుతోంది.. కొత్త ఆట పరికరాలు ఏర్పాటు చేసి పిల్లలకు ఆనందం పంచాలని స్థానికులు సూచిస్తున్నారు.



కూలే స్థితిలో పార్క్ ప్రహరీ

ఈ పార్క్ చుట్టూ నిర్మించిన రక్షణ గోడ ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

వేసవి ప్రారంభమైనా..

వేసవి కాలం ప్రారంభమైంది. త్వరలో పాఠశాలలకు సెలవులు ఇవ్వనున్నారు. ఈ సమయంలో స్థానికులు, వారి పిల్లలు సాయంత్రం పార్కులకు వెళ్లి కాసేపు సరదాగా గడపాలని అనుకుంటారు.. అందుకు తగ్గట్టే పార్కులను ఆట వస్తువులు, పచ్చదనంతో నిర్వాహకులు సిద్ధం చేస్తుంటారు. పిఠాపురం కాలనీ పార్క్ మాత్రం వీటికి నోచుకోలేదనే చెప్పాలి.



కళావిహీనంగా పిఠాపురం కాలనీ పార్క్

నిర్వహణను గాలికొదిలేశారు..

ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాల్సిన పిఠాపురం కాలనీ పార్క్.. అనారోగ్య సమస్యలు తెచ్చిపెడుతోంది. పార్క్ ప్రహరీ గోడ వద్దే పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ సందర్శకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దీని పరిసరాలు అపరిశుభ్రంగా.. అధ్వానంగా తయారయ్యాయి. ఈ పార్క్ నిర్వహణను అటు జీవీఎంసీ.. ఇటు స్థానిక నిర్వాహకులు గాలికొదిలేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పార్కును ఆధునికీకరించి, పరిశుభ్రత, రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా వాకింగ్ ట్రాక్

ఆరోగ్య పరిరక్షణకు ఉదయం, సాయంత్రం వేళల్లో చాలా మంది వాకింగ్ చేస్తుంటారు. అందుబాటులో ఉండే పార్క్‌లో వాకింగ్ చేస్తూ స్థానికులు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుంటారు. పిఠాపురం కాలనీ పార్క్‌లో నిర్మించిన వాకింగ్ ట్రాక్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో అధ్వానంగా మారింది. వాకర్లు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. తన్నుకొని పడిపోయే అవకాశముంది. ఈ వాకింగ్ ట్రాక్‌కు ఎప్పుడు మరమ్మతులు చేపడతారా అని స్థానికులు ఎదురు చూస్తున్నారు.



ట్రామా కేర్ సెంటర్ల సమాచార బోర్డుల ఏర్పాటు



సమాచారం బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు

బీచ్‌రోడ్డు: సిరిపురం ద్రోణంరాజు సర్కిల్ వద్ద మూడో పట్టణ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ట్రామా కేర్ సెంటర్ల సమాచార బోర్డును శుక్రవారం ఏర్పాటు చేశారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు గాయపడిన వ్యక్తుల చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రుల సమాచారంతోపాటు అవి ప్రమాద స్థలం నుంచి ఎంత దూరంలో ఉన్నాయని బోర్డులో పొందపర్చారు. ప్రమాదం జరిగినప్పుడు సంప్రదించవలసిన ఎమర్జెన్సీ సర్వీసెస్ ఫోన్ నంబర్లు, అధికారుల నంబర్లు మొదలగు సమాచారం తెలియజేసే సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ఇటువంటి బోర్డులు ఏర్పాటు చేశామని సీఐ అమ్మినాయుడు తెలిపారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువకులందరూ పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తదానం చేయం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు.

బీఎస్‌ఆర్ నగర్‌లో సమస్యలు పరిష్కరించాలి

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు తోటగరువు దరి బీఎస్‌ఆర్ నగర్‌లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా స్థానిక నాయకులతో కలిసి ఆయన బీఎస్‌ఆర్ నగర్ కొండపై పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తరుచూ కొండచరియలు విరిగిపడటం, తాగునీటి సమస్య, రక్షణ, గోడలు లేకపోవడం, చిన్న ఇళ్లకు కరెంట్ బిల్లులు అధికంగా రావడం తదితర సమస్యలు స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ బీఎస్‌ఆర్ నగర్ కొండపై 15 ఏళ్లుగా తిష్ట వేసిన సమస్యలపై అధికారులకు స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆరోపించారు. ఇక్కడి సమస్యలపై వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.నాగరాజు, ఎ.రమణ, గురుమూర్తి, రాము, నాగమణి, మౌనిక, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకుడు కుమార్

ఏయూ యాదవ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం రేపు

ఎంవీపీకాలనీ: ఈ నెల 23న శివాజీ పార్క్ వేదికగా ఏయూ యాదవ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధి, కార్యక్రమ సమన్వయకర్త డొక్కర శ్రీనివాస్ తెలిపారు. ఏయూ భౌతిక శాస్త్ర విభాగం వద్ద శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో కార్యక్రమ వివరాలు ఆయన వెల్లడించారు. శివాజీ పార్క్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వనభోజనాలు, వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సంఘ సభ్యులకు నిర్వహించిన క్రికెట్, షెటిల్ బ్యాడ్మింటన్, టగ్గావార్ వంటి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు అందజేస్తామన్నారు. సంఘంలోని 150 మంది విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, యాదవ ప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొంటారన్నారు.



సమావేశంలో పాల్గొన్న యాదవ ఉద్యోగులు

ముగిసిన రెండు రోజుల వర్క్‌షాప్

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన అకడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. కళాశాల రసాయనశాస్త్ర విభాగం నేతృత్వంలో నిర్వహించిన రెండో రోజు వర్క్‌షాప్‌లో 'న్యూ ఫ్రాంటైర్స్ ఇన్ కెమికల్ సైన్స్'అంశంపై సైన్స్ అకడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. వర్క్‌షాప్ నిర్వహించడానికి అనుమతి లభించినందుకు ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వర్క్‌షాపు విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధనలకు ఎంతగానో దోహదపడతుందని చెప్పారు. ప్రొఫెసర్ కేఆర్ ప్రసాద్ 'ఆర్గానిక్ సింథసిస్', ప్రొఫెసర్ రాజకుమార్ బల్లా 'స్పెక్ట్రోస్కోపిక్ టూల్స్', ప్రొఫెసర్ బీఎల్‌వీ ప్రసాద్ 'నానోపార్టికల్స్' అంశాలపై నూతన ఆవిష్కరణలు విద్యార్థినులకు విశదీకరించారు. ఈ నేపథ్యంలో ఐఐఎస్‌సీ బెంగళూరు నుంచి వచ్చిన ఆచార్యులు ప్రొఫెసర్ కేఆర్ ప్రసాద్, ప్రొఫెసర్ రాజకుమార్ బల్లా, ప్రొఫెసర్ బీఎల్‌వీ ప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి. కల్యాణ్‌రామ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. సంతోషి అనూష, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలివ్వాలి

డాబాగార్డెన్స్: గ్రంథాలయ సిబ్బంది చిరకాలంగా కోరుతున్న 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ సిబ్బంది, పెన్షనర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సును నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థల అకౌంట్‌కు జమ చేయాలని, గ్రంథాలయ సంస్థలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి గ్రాంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ వివిధ తీర్మానాలు ఆమోదించింది. అనంతరం తూర్పుగోదావరి జిల్లాతో కలుపుకుని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. మల్లేశ్వరరావు కన్వీనర్‌గా మరో 10 మందితో కమిటీ ఏర్పాటైంది. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలాది సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునికీకరిస్తామని గ్రంథాలయాలు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ నాయకుడు బి.ఆనందరావు, శ్రీకాకుళం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వైకుంఠరావు, విజయనగరం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామభద్రరాజు, విశాఖ, విజయనగరం జిల్లాల గ్రంథాలయ సంఘాల అధ్యక్షుడు ఆనందరావు, కె.శ్రీనివాసరావు వివిధ సమస్యలపై మాట్లాడారు. విశాఖ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తూర్పు గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక మంది గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశమైన గ్రంథాలయ సంస్థ నాయకులు, ఉద్యోగులు

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమొక్రటిక్ ఎంగేజ్‌మెంట్ అండ్ అకౌంటబులిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4న నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సదస్సుకు యూరోపియన్ యూనియన్–యురాసేమస్ ఆర్థిక సహకారం అందిస్తోంది. పరిశోధకులకు ఉపయుక్తంగా నిలిచే అంతర్జాతీయ సదస్సును నిర్వహించడంపై ఏయూ వీసీ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

24న డబ్ల్యూఎంవో వజ్రోత్సవం

ఎంవీపీకాలనీ: ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) వజ్రోత్సవం ఈ నెల 24న ఘనంగా నిర్వహించనున్నట్లు భారత వాతావరణ శాఖ, తుఫాన్ హెచ్చరికల కేంద్రం విశాఖ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 1950 మార్చి 23న ప్రపంచ వాతావరణ సంస్థ ఏర్పడినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ నెల 24న విశాఖ కార్యాలయంలో వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించింది. 'మనమంతా కలిసి ముందస్తు హెచ్చరికల అంతరం లేకుండా చేద్దాం' అనే ఇతివృత్తంతో 2025 డబ్ల్యూఎంవో వేడుకలు జరుపుకుంటున్నట్లు పేర్కొంది. వేడుకల్లో భాగంగా వాతావరణ శాఖకు చెందిన పరికరాలు, విశేష ఆదరణ ఉన్న చిత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం ప్రదర్శనలో ఉంచనున్నట్లు పేర్కొంది.

మహిళా కళాశాలలో అటవీ దినోత్సవం

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహించారు. వృక్షశాస్త్ర విభాగం నేతృత్వంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ అడవుల ప్రాముఖ్యత వివరించారు. ఫారెస్ట్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగావకాశాలు, ప్రిపరేషన్ వంటి పలు విషయాలు తెలియజేస్తూ కెరీర్ గైడెన్స్ ప్రొగ్రాం నిర్వహించారు.

రూ.10.5 కోట్లతో రెండు వసతి గృహాల నిర్మాణం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల మంజూరు
- జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు

ఎంవీపీకాలనీ: జిల్లాలో రెండు హాస్టళ్ల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ కె.రామారావు వెల్లడించారు. రూ.10.5 కోట్లతో వీటిని నిర్మించనుందని తెలిపారు. జిల్లా పరిషత్ దరి కృష్ణనగర్‌లో కాలేజ్ గర్ల్స్ హాస్టల్‌ను రూ.6 కోట్లతో, భీమిలిలో కాలేజ్ బాయ్స్ హాస్టల్‌ను రూ.4.5 కోట్లతో నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అనుమతులతో కూడిన మార్గదర్శకాలు అందాయన్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఉన్న రెండు హాస్టళ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త వాటిని నిర్మించాలని 2023లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ప్రతిపాదనలు పంపించిందన్నారు. వాటి స్థానంలో కొత్త హాస్టళ్ల నిర్మాణం త్వరలోనే ప్రారంభవుతుందన్నారు. దీంతోపాటు జిల్లాలోని 18 హాస్టల్స్‌కు ఆర్‌వో వాటర్ ప్లాంట్స్‌ను కొత్తగా మంజూరు చేసినట్లు తెలిపారు. సీఆర్‌ఎస్ నిధుల ద్వారా కలెక్టర్ ద్వారా అందించిన నిధులతో ఈ ప్లాంట్స్ మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే చాలా చోట్ల ప్లాంట్స్ నిర్మాణం కూడా పూర్తయిందన్నారు.



కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డీడీ రామారావు

ఆ విద్యార్థులు సచివాలయాలను సంప్రదించాలి

2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 9,002 మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద నిధులు మంజూరైనట్లు డీడీ రామారావు తెలిపారు. వారిలో డిగ్రీ, పీజీ విద్యార్థులతోపాటు ఇంజినీరింగ్, ఐటీఐ విద్యార్థులు తదితరులు ఉన్నారన్నారు. ఇంకా నిధులు మంజూరు కాని విద్యార్థులు జిల్లాలో 400 మంది వరకు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. వీరంతా వారికి స్థానికంగా ఉన్న సచివాలయాలకు వెళ్లి అర్హత పత్రాలు సమర్పించడంలో తలెత్తిన సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

టెర్రస్ మొక్కల పెంపకంపై అవగాహన



జూ పార్కులో మొక్కల కుండీలతో సంతపాలెం పాఠశాల విద్యార్థులు

ఆరిలోవ: అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇందిరాగాంధీ జూ పార్కులో టెర్రస్ మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 12వ వార్డు సంతపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి జూ పార్కును సందర్శించారు. టెర్రస్ గార్డెన్స్ వ్యవస్థాపకురాలు ఐశ్వర్య విద్యార్థులకు టెర్రస్ పంటలు, కూరగాయలు, పండ్ల మొక్కలు ఎలా పెంచాలో అవగాహన కల్పించారు. మొక్కలను కుండీల్లో ఏవిధంగా ఉత్పత్తి చేయాలి, వాటిని ఎలా పెంచాలి తదితర విషయాలను వివరించారు. పిల్లలతో కుండీల్లో మట్టి వేయడం, విత్తనాలు నాటించడం వంటివి చేయించారు. పర్యావరణంలో నాశనమవుతున్న పచ్చని చెట్ల విలాపం గురించి అవగాహన కల్పిస్తూ సంతపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరికి శ్రీనివాసరావు పాడిన పాట విద్యార్థులను, జూ అధికారులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కుండీల్లో మట్టి వేస్తున్న విద్యార్థులు

గడువులోగా ఆరోగ్య కార్యక్రమాలు పూర్తిచేయాలి

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగే అన్ని ఆరోగ్య కార్యక్రమాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఆయన ప్రోగ్రాం అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కుటుంబ సంక్షేమ శాఖ, మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, మాతా, శిశు మరణాల రేటు తగ్గింపు, గర్భిణులకు మందుల వినియోగం, ఇతర అంశాలపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఏఎన్ఎంలు ఎన్‌రోల్‌మెంట్ కరెక్ట్‌గా చేయాలని, వైద్యాధికారులు, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది సమయానికి ముఖ హాజరు వేయాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని డీఎంహెచ్‌వో తెలిపారు. పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. జూమ్ సమావేశంలో జిల్లాలోని ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు